# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  21-07-2024            సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రేపటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.
- ❖ రాష్ట్ర శాసనసభ సమావేశాలు రేపటి నుంచి నిర్వహించనున్నారు.
- ❖ గోదావరి జిల్లాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28న ప్రసారం కానుంది.

======================

రేపటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ  సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈరోజు ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అర్జున్ రామ్ మేఘవాల్, జేపీ నడ్డా, చిరాగ్ పాశ్వాన్, రాందాస్ అథవాలే, కాంగ్రెస్ నేతలు జైరామ్ రమేష్, గౌరవ్ గొగోయ్, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్, డీఎంకే నేతలు టీఆర్ బాలు, తిరుచ్చి శివ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్ తదితరులు  పాల్గొన్నారు.

======================

రాష్ట్ర  శాసనసభ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10  గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశాలు 5 రోజుల పాటు కొనసాగే అవకాశముందని శాసనసభ అధికార వర్గాలు తెలిపాయి.  ఈ సందర్భంగా ఉమ్మడి సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. అనంతరం శాసనసభపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై

నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశాలలో బడ్జెట్ తో పాటు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు తదితర బిల్లులను ప్రవేశపెట్టే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

గోదావరి జిల్లాలలో పర్యాటక రంగ అభివృద్ధికి విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను ఆయన ఈ రోజు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి సంబంధించిన అంశాల గురించి చర్చించారు. గోదావరి జిల్లాల్లో పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అదే విధంగా గోదావరి హేవలాక్ బ్రిడ్జి, పిచ్చుకలంక, కడియం నర్సరీ ప్రాంతాల పర్యాటక అభివృద్ధి గురించి కేంద్ర మంత్రి వద్ద ప్రస్తావించారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి తగిన అనుమతులు, నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని కందుల దుర్గేష్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. కేవలం 5 రూపాయలకే పేదల ఆకలి తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ఈ రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, పేద మధ్యతరగతి వర్గాల కోసం రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో రాయితీపై నిత్యవసర సరుకులు అందిస్తున్నామని అన్నారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏ-గ్రేడ్ కందిపప్పు కిలో 160 రూపాయిలు, రెండు రకాల నాణ్యమైన సోనా మసూరి బియ్యాన్ని కిలో 49 రూపాయలకే ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖలోని సింహాచలంలో నిన్న సాయంకాలం ప్రారంభించిన గిరి ప్రదక్షిణ ఈ రోజుతో ముగిసింది. గిరి ప్రదక్షిణకు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సింహాచలం చుట్టూ 32 కిలోమీటర్ల మేర కాలినడకన సాగిన గిరి ప్రదక్షిణలో లక్షలాదిగా భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా సింహాచలం శ్రీ వరహా లక్ష్మీ నృసింహస్వామికి చివర విడత చందన సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిశా పరిసర ప్రాంతాలపై గల అల్పపీడనం వాయువ్య దిశగా కదులుతూ ఛత్తీస్‌గఢ్ మీదుగా కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రానున్న 12 గంటల్లో ఛత్తీస్‌గఢ్ మీదుగా వాయువ్య దిశగా కదిలి క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతోంది. గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరుగుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద స్వల్పంగా పెరిగి 10.90 అడుగులకు చేరింది. దీంతో అధికారులు 175 గేట్లు ఎత్తి నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఈరోజు 5 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. అదే విధంగా పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి వరద మరింత పెరిగింది. ప్రాజెక్టు స్పిల్ వే వద్ద 31.700 మీటర్లకు నీటి మట్టం చేరింది. దిగువకు 7 లక్షల 96 వేల 686 క్యూసెక్కుల నీరు వదిలారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో లంక గ్రామాలకు వరద తాకిడి పెరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఈరోజు ఢిల్లీ నుంచి అధికారులతో మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ప్రస్తుతం అధిక వర్షాలు కురుస్తున్నాయని జిల్లా యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని కోరారు. లోతట్టు ప్రాంతాలు, వ్యవసాయ భూముల వద్ద జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముంపునకు గురైన గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ఏర్పాట్లపై మంత్రి సమీక్ష చేశారు. పునరావాస కేంద్రాలలో మంచి ఆహారం, మంచినీళ్లు అందేలా చూడాలన్నారు. ముంపు గ్రామాల్లో పశువులను సురక్షిత ప్రాంతాలకి తరలింపు, పశుగ్రాసం అందేలా చూడాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

గురు పూర్ణిమను ఈరోజు ప్రజలంతా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా ప్రజలకు గురు పూర్ణిమ శుభాకాంక్షలు తెలియజేశారు. సత్యం, ధర్మం, దయ, ధ్యానం ద్వారా సమున్నత జీవన గమ్యాన్ని ఏర్పరచుకోవాలన్న వేదవ్యాసుడి ఉపదేశాన్ని అనుసరిస్తూ... గురువుల పట్ల గౌరవంతో మెలగాలని ప్రజలను కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన గురుపూర్ణిమ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మూడు రోజుల శాకంబరీ ఉత్సవాలు ఈ రోజుతో ముగుస్తున్న నేపథ్యంలో సంప్రదాయ బద్ధంగా అర్చకులు పూర్ణాహుతి, ఇతర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామరావు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శ్రీశైలంలో ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబికా దేవి అమ్మవారికి శాకాంబరీ ఉత్సవం దేవస్థానంలో ఈ రోజు ఘనంగా నిర్వహించారు. శాకంబరీ ఉత్సవంలో భాగంగా శ్రీ భ్రమ రాంబికా దేవి అమ్మవారి మూల మూర్తికి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పలు రకాల ఫలాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సర్వ దర్శనం 18 గంటలలో జరుగుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 83 వేల 538 మంది భక్తులు దర్శించుకోగా భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా 4.25 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని అధికారులు పేర్కొన్నారు.

=======================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను రేపు సాలూరులో నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో రేపు ఉదయం 10 గంటల నుండి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

=======================
=======================